కబ్జా కోరల్లో ఫిరంగి నాలా

- నాలా చుట్టూ ప్రహరీల నిర్మాణం
- తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్న ఇరిగేషన్ అధికారులు
- కాలువను పునరుద్ధరించకపోవడంతో కబ్జాలకు ఊతం


ఫిరంగి నాలాలో నిర్మించిన ప్రహరీ

శంషాబాద్: ఫిరంగి నాలా కబ్జాదారులకు కాసులవర్షం కురిపిస్తోంది. నాలా పక్కల భూములు కొన్న యజమానులు నాలాను సైతం తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారికి అత్యంత సమీపంలోనే అక్రమాల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. కబ్జాదారుల కబంద హస్తాల్లో చిక్కి ఉనికి కోల్పోతున్న నాలాను పరిరక్షించడంలో ఇరిగేషన్ అధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్యం వీరికి వరంగా మారుతోంది.

శంషాబాద్ పట్టణంలో...

శంషాబాద్ పట్టణంలో జాతీయ రహదారికి పక్కనే ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారిని ఆనుకున్న సర్వే నంబర్లు 182, 275 మధ్యలో ఫిరంగి నాలా ఉంది. ఇది పూర్తిగా చదునుగా ఉండటంతో నాలా ఉందనే విషయం కూడా కనిపించని పరిస్థితి. ఇటీవల ఇక్కడ భూములు కొనుగోలు చేసిన కొందరు యజమానులు నాలాకు రెండు వైపుల భూములు తమవే ఉండటంతో చుట్టూ ప్రీకాస్ట్‌తో ప్రహరీని నిర్మించారు. మధ్యలో ఉన్న నాలాను పూర్తిగా తవ్వించాలని ఇటీవల స్థానికులు ఇరిగేషన్ అధికారులకు విన్నవించారు.

నాలాను తవ్వితేనే...

ఏడాదిన్నర క్రితం ఇక్కడే కొందరు కార్పొరేట్ స్థాయి బడాబాబులు ఏకంగా నాలాకు ఇరువైపుల ఉన్న గోడను సైతం తొలగించి మట్టితో చదును చేశారు. పదిహేను ఎకరాలకు పైగా ఇక్కడ నాలాకు ఇరువైపు కొందరు రియల్టర్లు భూములు కొనుగోలు చేశారు. భూమి చదునుగా ఉండటంతో నాలాను అమాంతం తమ భూముల్లోకి కలుపుకోవాలనే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనిపై ఇరిగేషన్ అధికారులు సత్వరమే చర్యలు తీసుకుని నాలా వెడల్పుతో పాటు పొడవును పునరుద్ధరిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

అధికారుల అలసత్వంతోనే..



అధికారుల అలసత్వం కారణంగానే పట్టణంలో ఫిరంగి నాలా ఆక్రమణలకు గురవుతోంది. ప్రీకాస్ట్ తొలగిస్తే సమస్య పరిష్కారం కాదు. ఇరిగేషన్ మ్యాపులో ఉన్న విధంగా నాలాను పునరుద్ధరించి బఫర్ జోన్ వరకు హద్దులు ఏర్పాటు చేస్తే నాలా పరిరక్షణ సాధ్యమవుతుంది. ఎయిర్‌పోర్టు రహదారి పక్కనున్న నాలాను అక్కమార్కులు తరచు తమ కబ్జాల్లోకి తీసుకుంటున్నారు.

– మురళి, శంషాబాద్

చర్యలు తీసుకుంటాం

నాలా పునరుద్ధరణ కోసం ప్రత్యేకంగా బడ్జెట్ పెట్టి చేయాల్సి ఉంటుంది. మధ్యలో నాలా ఉండి చుట్టుపక్కల నిర్మాణాలు చేపడితే తొలగిస్తున్నాం. ఇటీవల ప్రీకాస్ట్ వేసిన వాటిని కూడా తీయించాల్సిందిగా ఆదేశించాం. శాశ్వత నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటాం.

– మౌనిక, ఏఈ, ఇరిగేషన్

మొండికత్వా ప్రాంతానికొస్తే చర్యలు

- అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం
- రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి జన చైతన్య వెంచర్ ప్రాంతంలోని మొండికత్వా వద్ద ఫొటోలు దిగేందుకు, రీల్స్ చేసేందుకు, చేపలు పట్టేందుకు ఎవరు వచ్చినా వారిపై కేసులను నమోదు చేస్తామని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో హెచ్చరించారు. హిమాయత్‌సాగర్ నుంచి కిస్మత్‌పూర్ మీదుగా లంగర్‌హౌజ్ బాపూఘట్‌లోని మూసీ నదిలోకి వరదనీరు చేరేందుకు గతంలో ఈ కాలువను నిర్మించారు. హిమాయత్‌సాగర్ నిండితే గేట్ల ద్వారా నీటిని ఈ కాలువ గుండా మూసీలోకి వదులుతారు. జన చైతన్య వెంచర్‌తో పాటు కిస్మత్‌పూర్ ప్రాంతంలో రెండు కత్వాలను నిర్మించారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో ఈ కత్వాల పై నుంచి నీరు కిందికి జారుతుంది. వీటిని చూసేందుకు నగరం నలుమూలల నుంచి పలువురు యువకులు ఈ ప్రాంతానికి తరలి వస్తుంటారు. హిమాయత్‌సాగర్ వరద గేట్లు విప్పిన ప్రతిసారి ఈ ప్రాంతంలో సందడి నెలకొంటుంది. గడచిన మూడు సంవత్సరాల్లో ఈ ప్రాంతంలో నలుగురు యువకులు మృత్యువాత పడ్డారు. దీంతో రాజేంద్రనగర్ పోలీసులు ఈ ప్రాంతానికి వెళ్లకుండా కంచెను ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. గతంలో యువకులు ఈ ప్రాంతానికి వచ్చిన సమయంలో ఫొటోలు, రీల్స్ తీసి తమ సోషల్ మాధ్యమాల్లో పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ క్లిప్పింగ్‌లు యూట్యూబ్‌లో అలాగే ఉన్నాయి. జగద్గిరిగుట్టకు చెందిన అక్షిత్ రెడ్డి స్నేహితుల బృందం ఆదివారం నగరంలో సమీపం వాటర్ ఫాల్స్ అని సెర్చ్ చేయగానే ఈ మొండికత్వా ఫొటోలు, రీల్స్ రావడంతో ఇక్కడికి మృత్యువాత పడ్డాడు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో రాజేంద్రనగర్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. యువకులు ఎవరైనా ఈ ప్రాంతానికి వస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మొండికత్వా ప్రమాదభరితంగా ఉందని... నీళ్లు ఈ అలుగుపై నుంచి పారుతుండటంతో పాకురు పట్టిపోయిందన్నారు. దీని గుండా ప్రయాణించే సమయంలో జారి నీటి గుంతల్లోకి పడే అవకాశం ఉందన్నారు. కత్వా కింది భాగంలో లోతైన గుంతలు ఉన్నాయని.. రాళ్లు, రప్పలతో ఉండటంతో పాటు బురద పేరుకుపోయిందన్నారు. ఈత వచ్చినా.. బురదలో కూరుకుపోతే ప్రమాదం ఉందన్నారు. యువకులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి ఈ ప్రాంతానికి రావద్దని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌లో రూ. 1.40 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సోమవారం శంకుస్థాపన చేశారు. తేజస్వీనగర్, లక్ష్మీనగర్, రెడ్డి బస్తీ, సిక్ చావని ప్రాంతాల్లో రూ. 91 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్, ప్యాచ్‌వర్క్‌లకు శంకుస్థాపన చేశారు. అత్తాపూర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో రూ. 49 లక్షల వ్యయంతో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులకు కూడా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ... ప్రజల డిమాండ్లను నెరవేరుస్తూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయితే స్థానికులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా యూజీడీ పనులు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయన్నారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ అభివృద్ధి పనులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఎంతగానో దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్, నాయకులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

నియామకం


నియామకపత్రాలు అందజేస్తున్న వెంకటేష్

అత్తాపూర్: భారతీయ జనతా పార్టీలో కష్టపడి పని చేసే వారికి తగిన ప్రాధాన్యత లభిస్తుందని ఆ పార్టీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ అన్నారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ ఆదేశాల మేరకు అత్తాపూర్ డివిజన్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఉమాబాయి, అనురాధ, బీబీనగర్ శ్రీకాంత్‌చారి, ఎస్.నరేష్, ప్రధాన కార్యదర్శిగా రావుల భాస్కర్, పెంజర్ల వెంకట్‌రెడ్డి, కార్యదర్శులుగా పొట్ట గాయత్రి, ఎల్.శివరాజ్‌గౌడ్, విజయ, స్వామి, రాము, కోశాధికారిగా జి.లక్ష్మీకాంత్‌రెడ్డిలను ప్రకటించారు. చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడెం సుధాకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ విజయ్‌కుమార్, జయానంద్‌రెడ్డి, కిరణ్‌చారి, జి.రాజు, సరిత, బాలకృష్ణ, జితేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యత అవసరం

హెచ్‌సీయూ ప్రొ. కిషోర్‌కుమార్


మాట్లాడుతున్న హెచ్‌సీయూ ప్రొఫెసర్ కిషోర్

రాయదుర్గం: జీవరాశుల మనుగడకు మూలాధారం పంచభూతాలేనని హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ ఎర్త్, స్పేస్ సైన్స్ అండ్ ఓషన్ ప్రొఫెసర్ జి కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని శారదా ఉన్నత పాఠశాలలో సోమవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రకృతి, పర్యావరణ సమతుల్యత మానవ మనుగడకు అవసరమన్నారు. ఆధునికీకరణ, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వల్ల సంభవిస్తున్న పరిణామాలు ప్రకృతి విధ్వంసం దిశగా కొనసాగడం శోచనీయమన్నారు. ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బందా నరేంద్రబాబు, అసోసియేషన్ సభ్యులు పాలం శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజల్లో ఆదరణ

గోల్కొండ: కాంగ్రెస్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని కాంగ్రెస్ ఎస్సీ విభాగం జాతీయ చైర్మన్ రాజేంద్రపాల్ గౌతమ్ అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు మిత్ర కృష్ణ సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా వేసి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రపాల్ గౌతమ్ మాట్లాడుతూ..దళితులు, మైనార్టీలు, గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ ఎంతగానో కృషి చేసిందన్నారు. భారత రాజ్యాంగంలో వారికి పొందుపరిచిన హక్కులను వందశాతం ప్రయోజనాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందే అని ఆయన అన్నారు.

పాత పద్ధతిలోనే జీతాలను అందజేయాలి


సలావుద్దీన్ లోది

చార్మినార్: మసీదుల్లో పని చేసే మోజం, ఇమామ్‌లకు వెంటనే జీతాలు పెంచి నిబంధనలు సడలించాలని బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం వక్ఫ్ బోర్డు సీఈఓకు రాతపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మోజంలకు రూ12,000 ఇమామ్లకు రూ.10వేల జీత భత్యాలను అందజేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మూడు నెలలకోసారి ఆదాయం సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలని కోరడం సరైనది కాదన్నారు. పాత పద్ధతిలోనే వారికి జీతాలను అందజేయాలని ఆయన కోరారు.

పాతబస్తీలో షియా ముస్లిం చిన్నారుల వార్షిక ఝులా ర్యాలీ

చార్మినార్: షహజాదా అలీ అస్గర్ 1386వ, బలిదానం వార్షికోత్సవానికి సంబంధించి సోమవారం పాతబస్తీలో ఝులా షహదత్ ర్యాలీ జరిగింది. హజ్రత్ ఇమామ్ హుస్సేన్ (అ.స) చిన్న కుమారుడి త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ ఈ ర్యాలీ జరిగింది. ర్యాలీలో పాల్గొన్న షియా ముస్లిం చిన్నారులు తమ ఎదపై బాదుకుంటూ రక్తాన్ని కిందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు సయ్యద్ ఖ్రార్ హుస్సేన్ అబేది, సయ్యద్ అలీ హుస్సేన్ జైదీ తదితరులు పాల్గొన్నారు. ఖూనీ మాతంలో గాయాల గురైన చిన్నారులకు అప్పటికప్పుడే ప్రాథమిక చికిత్స అందించారు. మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ చిన్నారులను ఓదార్చారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాజేంద్రనగర్: శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–2007వ సంవత్సరం 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం పాఠశాల ప్రాంగణంలో కలిశారు. ఆత్మీయ సమ్మేళనంలో వారంతా అలనాటి మధుర స్మృతులను నేమరువేసుకున్నారు. విద్యార్థులంతా ఒకే చోట కలవడంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణంలా కనిపించింది. అనంతరం గురువులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. పూర్వ గురువులు నిరంజన్, కృష్ణమూర్తి, ప్రసన్నలక్ష్మి, ఇస్మాయిల్, శైలజా, జంగాచారి, కిషన్, లవలక్ష్మి, జయశ్రీ, గణేష్, చారి, విజయలక్ష్మి, యాదయ్య, ఆయమ్మలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కేసులు

శంషాబాద్: ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన 33 కేసుల్లో ఒకరి జైలు శిక్షతో పాటు మిగతా వారిని నుంచి జరిమానా వసూలు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిలో ఓ వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానాను కోర్టు విధించిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 17 మంది నుంచి రూ. 50 వేలు జరిమానా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారి నుంచి రూ. 32 వేల జరిమానా వసూలు చేశారమన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఉల్లంఘనులపై చట్టపరమైన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

‘అభివృద్ధి’లో భాగస్వామ్యం కావాలి


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అత్తాపూర్: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మరింత విజయవంతం కావాలంటే పౌర సంఘాల భాగస్వామ్యం అత్యవసరమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లో సోమవారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్ సంగీతకు లక్ష్మీ రామ్ హరణ్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల భాగస్వామ్యం, పౌర సంఘాల క్రియాశీలక పాత్ర వల్ల ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు మరింత ఫలితాన్ని ఇస్తాయన్నారు. ప్రభుత్వంతో పాటు పౌర సంఘాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, మిగతా సమయంలో అందరూ కలిసి అభివృద్ధికి చేయూతనివ్వాలని సూచించారు. పౌర సంఘాల నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర సూచించారు. సోమవారం కిస్మత్‌పూర్‌లోని కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో తడి, పొడి, హానికారక చెత్తపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి మహిళను భాగస్వామ్యం చేస్తూ నూతన సంఘాల ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డి.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌వో కె.శివకుమార్, టీఎంసీ ఎస్.శ్రీలత, ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ కార్పొరేషన్ 3వ డివిజన్‌లోని మాధవీనగర్ కాలనీలో ప్రజలకు తడి, పొడి చెత్తపై కాలనీ ప్రజలకు కమిషనర్ శరత్‌చంద్ర అవగాహన కల్పించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజీకుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ అహ్మద్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కుల్లో కొరవడిన ఆహ్లాదం

- ఓపెన్ జిమ్‌లో పాడైన పరికరాలు
- కొత్తవి ఏర్పాటు చేయాలని సందర్శకుల వినతి



హైదర్‌గూడలోని పెద్దతాళ్లకుంట పార్కు ముఖద్వారం

అత్తాపూర్: ఉరుకుల పరుగుల జీవన విధానంతో అలసిన నగరవాసులకు ఉభయ సంధ్య వేళల్లో పార్కులు ఆహ్లాదాన్నిస్తాయనడం నిర్వివాదాంశం. ఈ నేపథ్యంలో పార్కులు వచ్చినంతోపాటు ఇతర వసతులతో విరాజిల్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే కొన్ని పార్కుల్లో ఆహ్లాదం కొరవడుతోంది. వాకర్లకు కనీస వసతులు ఉండవు. మరికొన్ని పార్కుల్లో ఓపెన్ జిమ్‌లలో సరైన పరికరాలు ఉండవు. ఇందుకు అత్తాపూర్ డివిజన్‌లోని పెద్దతాళ్లకుంట పార్కు నిలువెత్తునిదర్శనంగా తయారవుతోంది. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో పార్కుతో పాటు అత్యాధునిక పరికరాలో రూ. 63 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేశారు. 2016 నవంబర్ 23న అప్పటి మంత్రి కేటీఆర్, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ పార్కును ప్రారంభించారు. జిమ్ ఏర్పాటు చేసి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా అరకొర వసతులే ఉన్నాయి.

◆ అత్తాపూర్, హైదర్‌గూడ, న్యూఫ్రెండ్స్ కాలనీ, కాంతారెడ్డి కాలనీ తదితర ప్రాంత ప్రజలు యువకులు పెద్ద ఎత్తున పెద్దతాళ్లకుంట పార్కుకు రోజు ఉదయం, సాయంత్రం వస్తారు. మహిళలకు అనుగుణంగా జిమ్ పరికరాలతో మహిళలకు వృద్ధులకు కావాల్సిన సౌకర్యాలు ఉండటంతో నిత్యం బిజీగా ఉండేది. ప్రస్తుతం అందులోని పరికరాలు పాడయ్యాయి. వాటికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకోవాలని వాకర్లు, వయోవృద్ధులు, యువకులు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



పెద్దతాళ్లకుంట పార్కులో మరిన్ని వసతులు కల్పించాలి. వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను వాడుతున్నాం. కొన్ని సంవత్సరాలుగా ఎన్ఎండీసీలో ఉద్యోగం చేసి నాలాంటి వారి కోసం జిమ్‌లను మరింతగా అభివృద్ధి చేయాలి. సీసీ కెమెరాలను కూడా ఆధునికీకరించాలి.

– వరద రాజు, హైదర్‌గూడ, విశ్రాంత ఉద్యోగి

కొత్త పరికరాలు అవసరం



ఉదయం, సాయంత్రం వేళలతో పాటు వీకెండ్స్‌లో బంధువులు, స్నేహితులతో కలి సి ఓపెన్ జిమ్‌కు చేరుకుంటాం. జిమ్‌కు పాఠశాల విద్యార్థిగా ఉన్న సమయం నుంచి వస్తున్నాం. ఇప్పుడు ఉన్నత చదువులు చదువుతున్నాం. జిమ్‌లో ఉపయోగకరంగా లేని పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి.

– డి.శశాంత్‌రామ్‌రెడ్డి, విద్యార్థి

రోడ్డు పనుల ప్రారంభం

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్ కాలనీలో రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి అన్నారు. ఆయా సమస్యలను వారు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వాటర్ బోర్డు అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం అధికారులు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. బీజేపీ నేతలు వెంకటరమణగుప్తా, మధుసూదన్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

మైలార్‌దేవ్‌పల్లి: పీఆర్‌టీయూటీఎస్ రాజేంద్రనగర్ మండల శాఖ ఆధ్వర్యంలో 2025–26వ సంవత్సర సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి, పద్మశాలీపురం, గణేష్ నగర్‌లలోని జెడ్‌పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమానికి జిల్లా మాజీ అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీర్మానించిన మేరకు నెలకు ఇవ్వాల్సిన రూ. 700 కోట్లు సహా గత నెల పెండింగ్‌లో ఉన్న రూ. 517 కోట్లు కలిపి మొత్తం రూ. 1217 కోట్లు తక్షణమే చెల్లించాలని కోరారు. సర్వీస్ రూల్స్ అమలుకు సంబంధించిన అధికారులకు తక్షణ ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు. ఈ నెల చివరిలోపు నూతన నిబంధనలు రూపొందించి ఆగస్టు మొదటి వారం నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు ఓడీ బేసిస్‌లో లాంగ్ డిప్యూటేషన్ ఇవ్వాలని తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు 57 మెమో ద్వారా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ మేనిఫెస్టో ప్రకారం సీపీఎస్ రద్దు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన కేబినెట్ సబ్ కమిటీ భేటిలో ప్రకటించినట్లే జేఏసీ 57 డిమాండ్లను ఆగస్టు 15లోగా అమలు చేయాలని స్పష్టం చేశారు. మండల శాఖ అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్, గౌరవ అధ్యక్షుడు మాణిక్యంరెడ్డి, రాష్ట్ర బాధ్యులు సురేష్‌కుమార్, రాజశేఖర్‌గౌడ్, సుధాకర్, రోహిణి, వెంకటయ్య అల్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

ఎస్ఈ శ్రీరామ్మోహన్


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ వినియోగదారులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని ఎస్ఈ శ్రీరామ్‌మోహన్, రాజేంద్రనగర్ డివిజనల్ ఇంజనీర్ పి.రత్నాకర్‌రావు ఆదేశించారు. సోమవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, శాస్త్రీపురం అసిస్టెంట్ ఇంజనీర్ సుధాకర్‌బాబులతో కలిసి ఆశమాబాద్, క్రిస్టల్ టౌన్‌లలో 1312, ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విద్యుత్ వినియోగదారుల నుంచి వచ్చిన సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు బాధ్యతాయుతంగా పని చేస్తున్నామన్నారు. వినియోగదారులు అధికారులకు సహకరించి సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు.